క్లుప్తంగా

సింగపూర్ సీఎం సభలో గురిజాల వాసి



నర్సంపేట రూరల్ : సింగపూర్‌లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కాగా వేదికపైకి నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ నీలం మహేందర్‌కు ఆహ్వానం లభించింది. సీఎం హాజరైన సమావేశానికి గురిజాలవాసికి మహేందర్ ఆహ్వానం రావడం గ్రామంలో, మండలంలో చర్చనీయాంశంగా మారింది. నీలం మహేందర్ సుమారు 15 ఏళ్లుగా అమెరికాలో నివాసం ఉంటున్నాడు.

జీపీలో డీఎల్‌పీఓ తనిఖీ



ఖానాపురం : మండలంలోని బోటిమీదితండా గ్రామ పంచాయతీని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి, ఇతర సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై దృష్టి సారించాలని, చెత్త సేకరణపై నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంగి రమేశ్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం శాలువా కప్పి పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్‌కు రాష్ట్ర అకాడమిక్ సెక్రెటరీగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ గ్రహీతకు..



సంగెం : మండలంలోని ఎల్గూర్ స్టేషన్ శివారు రామచంద్రునాయక్ తండాకు చెందిన గుగులోత్ రమేశ్ ఇటీవల చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకోగా ఆయనను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి సోమవారం శాలువ కప్పి సన్మానించారు. గిరిజనులు మరింత ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్, మెట్టుపల్లి రమేశ్, అచ్చ నాగరాజు, వెంకటేశ్వర్లు, నర్సింహనాయక్, జగన్నాథచారి, పాషా, చేరాలు, సారంగం, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్‌కు ఎక్సలెన్స్ అవార్డు



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ నిర్వాహకులు ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. వరంగల్‌లోని ఆ క్లబ్ కార్యాలయంలో లక్ష్మీనారాయణకు అవార్డు అందజేసి సతీసమేతంగా సన్మానించారు. లక్ష్మీనారాయణను మండలానికి చెందిన పలువురు అభినందించారు.

రెండు ఆటోలు చోరీ

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో, డీసీ తండాలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి ఎదుట నిలిపిన రెండు ఆటోలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన తుమ్మల విజయ్, డీసీ తండాకు చెందిన ఆంగోతు సుధాకర్ రోజువారీగా ఆటో నడుపుకుని ఇంటికి వెళ్లాక ఇంటి ఎదుట పార్క్ చేశారు. తెల్లవారుజామున బాధితులు ఆటోలు చోరీకి గురైన విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గీసుకొండ : మండలంలోని ధర్మారం శివారులోని సురేశ్ పౌల్ట్రీ ఫాంలో రూ.5 వేల 625 విలువైన 255 కిలోల రేషన్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు తనిఖీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

బైపాస్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- 20 ఏళ్లుగా బీటీ వేయించని దుస్థితి
- పూర్తిగా గుంతలమయం
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



బైపాస్ రోడ్డులోని గుంతల్లో నిలిచిన నీరు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం రోడ్డు ఏర్పాటు చేయగా ఇప్పటివరకు తారు, బీటీ వేయించని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా రోడ్డును అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టణంలోని సర్వాపురం శివారులోని మహబూబాబాద్ నుంచి పాకాల్ రోడ్డుకు వెళ్లేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం బైపాస్‌కు రోడ్డు పేరుతో మట్టి పోసి వదిలేశారు. స్వరాష్ట్రం సాధించుకుని బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక తారు పోస్తారని, బీటీ రోడ్డు నిర్మిస్తారని ప్రజలు ఆశించారు. అయినా పట్టించుకున్న దాఖలాల్లేవు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అయినా రోడ్డు వేస్తారని ఆశించగా ఏడాది గడచినా రోడ్డు వేసే పరిస్థితి కనిపించడం లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మిస్తే వరంగల్, నెక్కొండ నుంచి పాకాల్, కొత్తగూడ దిశగా ప్రయాణం సులువవుతుంది. నర్సంపేట పట్టణంలోకి ప్రయాణికులు రావాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ సైతం తగ్గుతుంది. రెండు సార్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బైపాస్ రోడ్డులోని ఖాళీ స్థలంలో నాటి సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమావేశాలు నిర్మించగా రోడ్డుపై మట్టి పోయించి గుంతలు పూడ్చి మమ అనిపించారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఇటీవల మిషన్ భగీరథ పైపులకు లీకేజీలు ఏర్పడి గుంతల్లో నీరు చేరుతుండడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో రోడ్డు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. సర్వాపురంలోని 5వ వార్డు ప్రజలు స్మశానవాటికకు ఈ దారి మీదుగా వెళ్లేందుకు జంకుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం

నర్సంపేటలోని సర్వాపురం శివారు బైపాస్ రోడ్డు శాశ్వత నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ముందుగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తాం. అవసరమైతే తాత్కాలికంగా పనులు చేపట్టి గుంతలను పూడ్చివేస్తాం. ప్రభుత్వం నుంచి మంజూరీ రాగానే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మిస్తాం.

- రాజేశ్, ఏఈ, మున్సిపాలిటీ

అర్హులందరికీ పథకాలు అందాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ

వర్ధన్నపేట : అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు అందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ సుధీర్‌కుమార్ ఆకాంక్షించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వార్డు సభలపై వారు సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణ, కమిషనర్ సుధీర్‌కుమార్ మాట్లాడారు.అన్ని వార్డుల్లో సభలు నిర్వహిచి అర్హులను ఎంపిక చేయాలని చెప్పారు. అవకవతవకలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు భూక్య సరిత, మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి

గీసుకొండ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి (మంగళవారం) నుంచి నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్, ఎంపీడీఓ కృష్ణవేణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సభకు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు హాజరై సంబంధిత పథకాలకు అర్హుల జాబితాలను ప్రత్యేక రిజిస్టర్లలో పొందుపర్చాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఏఓ హరిప్రసాద్‌బాబు, ఎంపీఓ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువజనాభివృద్ధికి బాటలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై శ్రవణ్‌కుమార్

- ఎస్సై శ్రవణ్‌కుమార్

రాయపర్తి : క్రీడలతో యువజనాభివృద్ధికి బాటలు పడతాయని స్థానిక ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని తిర్మలాయపల్లిలో సోమవారం నిర్వహించిన బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువత చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. యువత ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నతంగా ఆశయాలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డైరెక్టర్ మచ్చ రాజు, వలంటీర్ దోమల నవీన్, మాజీ సర్పంచ్ వశపాక కుమారస్వామి, పంతంగి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం జయ

చెన్నారావుపేట : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఉప్పరపల్లి ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయ ఆకాంక్షించారు. మండలంలోని ఆ స్కూల్‌లో గ్రామానికి చెందిన కసరబోయిన రమాదేవి-కట్టయ్య దంపతులు వారి కుమారుడు నాగరాజు జ్ఞాపకార్థం రూ.1.15 లక్షల వ్యయంతో నిర్మించిన కళావేదికను రమాదేవి-కట్టయ్య దంపతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయ మాట్లాడారు. రమాదేవి-కట్టయ్య దంపతుల కుమారుడు నాగరాజు గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడేలా కళావేదిక నిర్మించారని, 150 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజు మాట్లాడారు. పాఠశాలలో కలాం ఫౌండేషన్ సహకారంతో కళావేదిక నిర్మించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రమాదేవి-కట్టయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కలాం ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాషమియా, పరికి మధూకర్, కమిటీ చైర్మన్ చింతకింది సుజాత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, పోగుల అశోక్, బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు పులి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



కళావేదికను ప్రారంభిస్తున్న రమాదేవి కట్టయ్య

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన నర్సంపేటలోని కాకతీయ నగర్‌లోని చర్చి వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. చెన్నారావుపేట నుంచి నర్సంపేట దిశగా ద్విచక్ర వాహనంపై వస్తుండగా మహేశ్వరం తండాకు చెందిన రాజ్‌కుమార్ నడుపుతున్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చుని ఫోన్ మాట్లాడుతున్న వినయ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్, వినయ్ గాయాలపాలవగా ఆస్పత్రికి తరలించారు. వినయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు పంపించారు.

గిర్నిబావిలో...

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గిర్నిబావిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. దుగ్గొండికి చెందిన పర్లపెల్లి శ్యామ్ ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా వరంగల్ దిశగా వెళ్తున్న చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడతండాకు చెందిన మోహన్ వాహనం ఒకదానికి మరొకటి ఢీకొన్నాయి. ఇద్దరికీ గాయాలు కాగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంకు చెందిన దూడెం కిరణ్‌కుమార్ కుటుంబీకులు గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక రెండ్రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. రూ.1.33 లక్షల అప్పు తీసుకుని తిరిగి చెల్లించినా ఇంకా సుమారు ఇంకా రూ.50 వేల వరకు చెల్లించాలని మూడు నెలలుగా వేధిస్తున్నట్లు కిరణ్ కుటుంబీకులు తెలిపారు. వేధింపులు కొనసాగుతుండడంతో వాట్సాప్ గ్రూపుల్లో కిరణ్ సోమవారం రాత్రి పోస్టు చేశాడు.

ఇందిరమ్మ భరోసా ఇవ్వాలి

నల్లబెల్లి : ఉపాధి కూలీలందరికీ ఇందిరమ్మ భరోసా కింద రూ.12 వేలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను విస్మరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు.

వ్యవసాయ బావులకు విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక తండా పరిధిలోని వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా 'విద్యుత్ కోత.. ఎండిపోతున్న పంటలు' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వ్యవసాయ బావులకు అధికారులు విద్యుత్ సరఫరా చేశారు. విద్యుత్ శాఖ ఏఈ జోగానంద్ రైతులతో మాట్లాడారు. సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని రైతులను కోరారు. 'సాక్షి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



తిరుపతి (ఫైల్)

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పోచమ్మతండా శివారు మహారాజ్ తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ తిరుపతి (39) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఈనెల 18న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడి తండ్రి గమనించి స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి కేవ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

లింగాపురంలో..



రత్నాకర్ (ఫైల్)

చెన్నారావుపేట : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఒరుగంటి రత్నాకర్ (30) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. రత్నాకర్ గతనెల 30న ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామంలో యూత్ కాంగ్రెస్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా కోల రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా పాక మహేందర్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి రాధారపు రాజు, అంగిరేకుల మధూకర్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాహనాలు మేలు



షోరూంను ప్రారంభిస్తున్న ఎస్సై

నల్లబెల్లి : కాలుష్య రహిత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మేలని ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి ఏర్పాటు చేసి ఫ్రాంక్లిన్ ఎలక్ట్రిక్ మోటార్ షోరూంను ఎస్సై గోవర్ధన్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. వాహనదారులకు నిర్వహణ ఖర్చు సైతం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రాంక్లిన్ ఎలక్ట్రిక్ మోటార్స్ కంపెనీ ప్రతినిధి గడ్డం అప్పయ్యదాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, నాయకులు మామిండ్ల మోహన్‌రెడ్డి, చీకటి ప్రకాశ్, రేవూరి నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, గోనెల నరహరి, బొడిగె సమ్మయ్య, వీరమల్లు, వీరస్వామి, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



సంగెం : కొత్తగూడెంలో..



సర్వేలో పారదర్శకత పాటించాలి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక కోసం సర్వే సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా సర్వేను ఖానాపురంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంగెంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, పర్వతగిరిలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వసుమతి, దుగ్గొండిలో ఎంపీడీఓ అరుంధతి ప్రత్యక్షంగా పరిశీలించి బృందాలకు సూచనలు చేశారు. ప్రజలతోనూ మాట్లాడారు. సర్వే బృందాలు సమర్థవంతంగా, పారదర్శకంగా వివరాలు సేకరించాలని చెప్పారు. బృందాలకు ప్రజలు సమాచారం అందించి సహకరించాలని కోరారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ

ఏకపక్షంగా మున్సిపాలిటీలో విలీనం

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ప్రజల అభిప్రాయంతో కాకుండా ఏకపక్షంగా గెజిట్ విడుదల చేసి గ్రామాలను నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేశారని బీఆర్‌ఎస్ నేత, స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కోటాలు, వాటాలు ఉంటే గ్రామసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు గ్రూపులుగా విడిపోయి ప్రజలను వేధిస్తున్నారని చెప్పారు. కాపాడుతామంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలపై దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే ఒక్కరోజు కూడా ముఖ్యమంత్రి వద్ద నియోజకవర్గ, మున్సిపాలిటీ అభివృద్ధి గురించి మాట్లాడలేదని ధ్వజమెత్తారు. సొంత ఏజెన్సీ కాంట్రాక్టు పనుల కోసం నిధులను రద్దు చేసి పనులను మారుస్తున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా గ్రామాలను విలీనం చేయడం వల్ల ప్రజలు ఉపాధి హామీ పథకం కోల్పోతారని ఆందోళన వెలిబుచ్చారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



నల్లబెల్లి : స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్, పోలీస్ అధికారులు

- ఆరుగురిపై కేసు నమోదు
- భారీగా పానకం ధ్వంసం, గుడుంబా స్వాధీనం

నల్లబెల్లి : మండలంలోని నందిగామలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్థానిక పోలీసులు గుడుంబా స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించారు. సుమారు 1300 లీటర్ల పానకం కలిగిన డ్రమ్ములను ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీపై దాడులు కొనసాగుతున్న తయారీ తగ్గడం లేదన్న సమాచారం మేరకు మూడు బృందాలుగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి మాట్లాడారు. గుడుంబా తయారు చేసినా, అమ్మినా పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుడుంబా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగయ్య, నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, స్థానిక ఎస్సై గోవర్ధన్, ఎన్‌ఫోర్స్‌మెట్ ఎస్సై శిరీష, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



పర్వతగిరి : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పర్వతగిరి : మండలంలోని తూర్పుతండా, ఏనుగల్, మూడెత్తులతండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై జిల్లా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప వివరాలు వెల్లడించారు. తూర్పుతండాలో 10 లీటర్ల నాటుసారా, 25 లీటర్ల నల్లబెల్లం, 10 కేజీల పటిక స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌చందర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సరిత, స్థానిక ఎస్సై ప్రవీణ్, కానిస్టేబుళ్లు వై.శరత్‌కుమార్, అనిల్‌కుమార్, వంశీకృష్ణ, పరశురాం, జగదీశ్, సంతోశ్ రాజమౌళి పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి దేవులపల్లి రవి నుంచి రూ.11,500 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా, అంబర్ ప్యాకెట్లను తదుపరి విచారణ కోసం ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లుకు అప్పగించారు. రవిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

చక్రుతండాను జీపీగా ఏర్పాటు చేయాలి

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామ పరిధిలోని చక్రుతండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బానోతు నెహ్రూనాయక్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు మంత్రి సీతక్క ఎండార్స్ చేసిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. అనంతరం నెహ్రూ మీడియాతో మాట్లాడారు. ×మా తండాలో మా రాజ్యం, మేమెంతనో మాకంత వాటా¤ నినాదంతో ఎల్‌హెచ్‌పీఎస్ నంగారాభేరి స్థాపించి ఇప్పటి వరకు 3500 తండాలను పంచాయతీలుగా సాధించుకున్నామని చెప్పారు. స్థానిక నాయకుల స్వార్థ రాజకీయాలతో ఇంకా పలు తండాలు పంచాయతీలు కాకుండా ఉన్నాయని తెలిపారు. 500 జనాభా కలిగిన అన్ని తండాలను పంచాయతీలుగా చేశాకే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చక్రుతండాను గ్రామపంచాయతీగా చేయాలని కోరుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలవగా వినతిపత్రాన్ని సీతక్క ఎండార్స్ చేసి ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బానోతు సంతోశ్, గుగులోతు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.